بسم الله الرحمن الرحيم

# ముందు మాట

الحمد لله والصلاة والسلام على سيدنا ونبينا وحبيبنا رسول الله صلى الله عليه وسلم، وعلى آله وصحبه أجمعين...امابعد:

నిస్సందేహంగా సమస్త స్తోత్రములు అల్లాహ్ కొరకే, మేము ఆయననే స్తుతిస్తున్నాము, ఆయననే సహాయం అర్థిస్తున్నాము. ఆయనను మాత్రమే క్షమాభిక్ష ప్రసాదించమని కోరుచున్నాము. మాకు మేము కల్గించుకునే కీడుల నుండియూ, మా కర్మల చెడుల నుండియూ మేము అల్లాహ్ శరణు కోరు చున్నాము.

అల్లాహ్ సన్మార్గం చూపినవారిని ఎవరూ మార్గభ్రష్టులను చేయలేరు. ఆయన ఎవరినైతే మార్గభ్రష్టులను చేస్తాడో వారిని ఎవరూ సన్మార్గంపై నడిపించ లేరు. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు ఎవరూ లేరని సాక్ష్యమిస్తున్నాను, మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అల్లాహ్ యొక్క దాసుడు మరియు సందేశపరుడు అని నేను సాక్ష్యమిస్తున్నాను. అల్లాహ్ ఆయనపై, ఆయన కుటుంబీకులపై, ఆయన అనుచరులపై, అలాగే ప్రళయం వరకు ఉత్తమ రీతిలో ఆయనను అనుసరించిన వారందరిపై కారుణ్యం, శాంతి కురిపించుగాక!

ఇస్లాం ధర్మం ఉన్నత నైతిక ప్రమాణాలు గల ధర్మం. సంపూర్ణ జ్ఞానం, వివేకంతో కూడుకున్న ధర్మం. వ్యక్తిగతంగా మరియు సామాజికంగా పాటించ వలసిన గొప్ప సంస్కారాలు అందులో ఉన్నాయి. ప్రతి మనిషి గౌరవ ప్రతిష్ఠ లతో బ్రతకడానికి కావలసిన విధానాలు ఈ ధర్మంలో స్పష్టంగా తెలుపబడ్డాయి. ఒకవైపు అల్లాహ్ ఉనికిని మరియు అల్లాహ్ గుణగణాలను పూర్తిగా తెలుపుతూనే మరో వైపు అల్లాహ్ భక్తులు ఆ అల్లాహ్‌ను ఎలా విశ్వసించాలో, ఎలా ఆరాధనలు పాటించాలో, మూఢ నమ్మకాలకు ఎలా దూరం కావాలో స్పష్టంగా బోధపరుస్తుంది.

https://teluguislam.net



ఈ ధర్మంలో ఒక వ్యక్తి మరో వ్యక్తి పట్ల, ఒక సమూహం మరో సమూహం పట్ల, ఒక దేశం మరో దేశం పట్ల ఎలా వ్యవహరించాలన్న నియమ నిబంధనలను పూర్తిగా తెలుపడం జరిగింది. అసహజమైన నియమాలు కాకుండా, ఆచరించలేని విధానాలు లేకుండా, మానవ మర్యాదలు భగ్నం కాకుండా, ఉన్నతమైన జీవితాన్ని గడపవలసిన ఉన్నత నైతిక ప్రమాణాలను తెలుపడం జరిగింది.

వీటి కార్యసాధన కొరకు అల్లాహ్ అనేక మంది ప్రవక్తలను ప్రభవింపజేసి, వారందరిని అల్లాహ్ తన ఇష్టానుసారం నడిపించి గౌరవ ప్రతిష్టలను ప్రసాదించాడు. సాధారణ ప్రజలు కూడా ఉన్నతమైన జీవితాన్ని పొందాలంటే మరియు సుఖసంతోషమైన జీవితం గడపాలంటే వారి అడుగు జాడల్లో నడుచుకోమని ఆజ్ఞాపించాడు. ఇలా తెలియజేసే పరంపర ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రాకతో పరిసమాప్తమయింది. కనుక ప్రజలు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారి అడుగుజాడల్లో నడుచుకుంటే ఇహపరాలలో సుఖసంతోషాలు పొందుతారు. పరలోకంలో సాఫల్యం కూడా వారి సొంతం అవుతుంది. ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَقُولُوا قَوْلًا سَدِيدًا – يُصْلِحْ لَكُمْ أَعْمَالَكُمْ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ وَمَنْ يُطِعِ اللَّهَ وَرَسُولَهُ فَقَدْ فَازَ فَوْزًا عَظِيمًا(الاحزاب:70–71)**

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. మాట్లాడితే సూటిగా మాట్లాడండి (సత్యమే పలకండి) తద్వారా అల్లాహ్ మీ ఆచరణలను చక్కదిద్దుతాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఎవరయితే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత కనబరచాడో అతను గొప్ప విజయం సాధించాడు."**

***(సూరతుల్ అహ్‌జాబ్: 70–71)***

ప్రస్తుతం మన సమాజంలో అధిక శాతం ప్రజలు ధర్మాన్ని పట్టించుకోకుండా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం విధేయతను లెక్క చెయ్యకుండా తమ ఇష్టానుసారం జీవించడమే గొప్పగా భావిస్తున్నారు. మంచి, చెడులకు ఒక కొలబద్ద అనేది లేనేలేదు. సద్గుణాలకు, దుర్గుణాలకు తేడా

లేకుండా బ్రతుకుతున్నారు. పెద్దవారి యెడల మర్యాద సన్నగిల్లింది. సిగ్గు, బిడియం విడిచిపెట్టి విచ్చలవిడిగా తిరుగుతున్నారు. సహజీవనం (వివాహేతర సంబంధం) పెచ్చుమీరుతుంది. మర్యాదపూర్వకమైన వివాహ సంబంధాలు తుడుచుకుపోతున్నాయి. మనిషి తిరిగి అజ్ఞానపు కాలానికి చెందిన గుణహీణమైన జీవితాన్ని అనుసరిస్తున్నాడు.

ఓ ప్రియమైన విశ్వాసులారా! అల్లాహ్ మీకు ఒక పవిత్రమైన జీవితాన్ని ప్రసాదించాడు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం జీవితపు అన్ని రంగాలలో మనకు ఉత్తమమైన మార్గదర్శకం చూపెట్టారు. మరియు వారు జీవించే విధానాన్ని అనేక పాయలుగా విభజించి అనుసరించి వాటి ప్రకారం నడుచుకోమన్నారు.

శుచి శుభ్రతలు, సిగ్గు బిడియాలు, నీతి, నిజాయితి, అప్పగింతలు, కరచాలనం మరియు సలాం చేసే నియమాలు, అనుమతి తీసుకునే సభా సమావేశం మర్యాదలు, ఆవలింతలు మరియు తుమ్ముల వాస్తవాలు, వాటి నియమాలు మరియు తినే, త్రాగే విధానము, నిద్రపోయి, మేల్కొనే నియమాలు, వివాహ నియమాలు మరియు అంత్యక్రియల వంటి ముఖ్యమైన అంశాలను ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీసుల వెలుగులో ఈ పుస్తకంలో వివరించబడ్డాయి.

ఈ పుస్తకంలో ప్రచురించబడిన నియమాలను అనుసరించడం ద్వారా ప్రతి ఒక్కరు తమ జీవితాలను సంస్కరించుకోవచ్చు. ఎవరైతే అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (స)ను అనుసరిస్తున్నారో వారికి తమ గుణాలను సంస్కరించుకునే అవకాశం లభ్యమయ్యినట్లే. వారికి ఇహలోకంలో గౌరవప్రదమైన జీవితంతో పాటు పరలోకంలో పుణ్యాలు కూడా ప్రాప్తిస్తాయి.

తిరుపతి
10-10-2013

**- జఫరుల్లాహ్ బషీర్ ఖాన్**